# మిలియనీర్ల క్విట్ ఇండియా

**భారత్‌కు గుడ్‌బై చెప్తున్న కోటీశ్వరులు**

**ఈ ఏడాది ఏకంగా 4,300 మంది రెడీ**

**కేంద్రం ఏకపక్ష నిబంధనలే ప్రధాన కారణం**



*పెట్టుబడులు పెట్టి, కంపెనీలు స్థాపించి వందలాది మందికి ఉపాధి కల్పించాల్సిన కోటీశ్వరులైన వ్యాపారులు భారత్‌ను వీడుతున్నారు. ఈ ఏడాది దాదాపు 4,300 మంది మిలియనీర్లు భారత్‌ను విడిచిపెట్టి విదేశాలకు వెళ్లను న్నారు. ఈ మేరకు హెన్లీ అండ్ పార్టనర్స్ రిపోర్టు-2024 పేర్కొన్నది. మిలియనీర్ల వలసలు ఎక్కువగా ఉన్న దేశాల జాబితాలో చైనా, యూకే వరుసగా తొలి రెండు స్థానాల్లో ఉండగా భారత్ మూడో స్థానంలో నిలవడం గమనార్హం.*

**వలసలకు కారణాలేంటి?**

*దేశంలో నెలకొన్న పరిస్థితులు, కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం అమలుచేస్తున్న ఏకపక్ష విధానాలు, తీసుకొస్తున్న కొత్త నిబంధనల పట్ల విసుగెత్తే మిలియనీర్లు మాతృదేశాన్ని విడిచిపెట్టి బయటి దేశాలకు వలస వెళ్తున్నట్టు ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. దీంతోపాటు దేశంలో భద్రత, ఆర్థిక పరిస్థితులు, పన్ను ప్రయోజనాలు, వ్యాపారావకాశాలు, పిల్లలకు విద్యావకాశాలు, వైద్యం, జీవన ప్రమాణాలను బేరీజు వేసుకొన్న తర్వాతనే ఇండియన్ మిలియనీర్లు ఇతర దేశాలకు వలస వెళ్తున్నట్టు హెన్లీ నివేదిక వెల్లడించింది. -(స్పెషల్ టాస్క్ బ్యూరో), హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ)*

**వలసలతో భారత్‌కు ఎంత నష్టమంటే?**

గడిచిన మూడేండ్లలో కోటీశ్వరుల మొత్తం వలసల సంఖ్య **18,300**

భారత్‌లో ఒక్కో మిలియనీర్ పెట్టగలిగే కనీస పెట్టుబడి **8.2 కోట్లు**

ఈ లెక్కన మూడేండ్లలో దేశ ఆర్థిక వ్యవస్థ నష్టపోయిన మొత్తం **1,50,060 కోట్లు**

**వలసలు ఇలా..**

2024లో ప్రపంచవ్యాప్తంగా వలసలకు సిద్ధమైన కోటీశ్వరుల సంఖ్య **1,28,000**

**కోటీశ్వరులు తమ గమ్యస్థానంగా ఎంచుకొన్న దేశాలు**

యూఏఈ (తొలి ప్రాధాన్యం), అమెరికా (రెండో ప్రాధాన్యం)



## టెస్టులకు ముందు యాంటీ బయాటిక్స్ వద్దు


**నేషనల్ మెడికల్ కమిషన్ నూతన మార్గదర్శకాలు**

న్యూఢిల్లీ: రోగనిర్ధారణ పరీక్షల కంటే ముందు యాంటీ బయాటిక్స్‌ను రోగులకు సూచించొద్దని నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) స్పష్టం చేసింది. వైరస్‌లు, బ్యాక్టీరియాలు యాంటీబయాటిక్స్‌ను తట్టుకొనేలా తయారవుతున్న నేపథ్యంలో వైద్యులకు కీలక సూచనలు చేసింది. 'నేషనల్ యాక్షన్ ప్లాన్ ఆన్ యాంటిమైక్రోబయాల్ రెసిస్టెన్స్' పేరుతో ఈ నెల 14న మార్గదర్శకాలను జారీ చేసింది. రోగులు వైద్య పరీక్షలు చేయించుకొనే ముందు యాంటీ బయాటిక్స్ వాడకుండా చూడాలని ఎన్ఎంసీ మార్గదర్శకాల్లో సూచించింది. అత్యవసర సమయాల్లోనే.. అదీ డాక్టర్ రోగాన్ని గుర్తించలేకపోతేనే రక్త పరీక్షలకు ముందు యాంటీబయాటిక్స్ వాడాలని వెల్లడించింది. ఈ మధ్య కాలంలో వైద్యులు ప్రతి చిన్న రోగానికి యాంటీబయాటిక్స్ సిఫార్సు చేస్తున్న నేపథ్యంలో ఈ మార్గదర్శకాలు వెలువడటం గమనార్హం. రోగ కారకాలు యాంటీబయాటిక్స్‌ను తట్టుకొనేలా తయారైతే, వ్యాధి ముదిరి మరణాలు సంభవించే ప్రమాదం ఉన్నదని గుర్తుచేస్తూ, యాంటీబయాటిక్స్ వాడకంపై కచ్చితమైన నిర్దేశం చేసింది. ఇచ్చే డోసు కూడా వ్యాధి తీవ్రతను బట్టి పెంచుతూ పోవాలని సూచించింది.

# కన్నడ ప్రజలపై చార్జీల మోత!

- బెంగళూరులో నీటి బిల్లుల పెంపు!
- సూచనప్రాయంగా వెల్లడించిన డీకే
- బీడబ్ల్యూఎస్ఎస్‌బీ నష్టాల పేరుతో నగర ప్రజలపై భారం వేసే ప్లాన్
- మూడు రోజుల క్రితం పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్ 4 శాతం పెంపు
- ఆర్టీసీ బస్సు చార్జీలను కూడా పెంచే యోచనలో కాంగ్రెస్ ప్రభుత్వం



బెంగళూరు, జూన్ 19: ఐదు గ్యారెంటీల పేరుతో కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు చుక్కలు చూపిస్తున్నది. ఇప్పటికే పెట్రోల్, డీజిల్, ఇతరత్రా వాటిపై పన్నులను పెంచేసిన సిద్ధరామయ్య ప్రభుత్వం, ప్రజలకు మరో చార్జీల వాత పెట్టేందుకు సిద్ధమైంది. రాష్ట్ర రాజధాని బెంగళూరు నగరంలో నెలవారీ నీటి బిల్లులను పెంచనున్నట్టు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సూచనప్రాయంగా వెల్లడించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ బెంగళూరు నీటి సరఫరా, సీవేజ్ బోర్డు(బీడబ్ల్యూఎస్ఎస్‌బీ) ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని చెప్పుకొచ్చారు. గత పదేండ్లుగా బెంగళూరులో నీటి బిల్లులను పెంచలేదని అన్నారు. కొత్త ప్రాజెక్టులు చేపడుదామనుకొన్నా.. రుణాలు ఇచ్చేందుకు ఏ బ్యాంకు ముందుకు రావడం లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో మరో ఆప్షన్ లేదని, దీనిపై అధికారులకు సూచన చేశానని చెప్పారు.

**ఏడాదిలో వరుస పన్నుల మోత**

మూడు రోజుల క్రితం పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్‌ను 4 శాతం పెంచడంతో రెండు ఇంధనాల ధరలు లీటర్‌కు రూ.3 చొప్పున పెరిగాయి. రాష్ట్రంలో బస్సు చార్జీలను కూడా పెంచే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తున్నది. బస్సు చార్జీల విషయంపై తాను రవాణా శాఖ అధికారులతో చర్చలు జరుపుతానని సీఎం సిద్ధరామయ్య సోమవారం పేర్కొన్నారు. గత ఏడాదిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే గైడెన్స్ వ్యాల్యూ ట్యాక్స్, అదనపు ఎక్సైజ్ డ్యూటీ, రవాణా వాహనాలపై అదనపు సెస్, ఈవీలపై లైఫ్ టైమ్ ట్యాక్స్‌ను పెంచేసింది.

**గ్యారెంటీలకు అడ్డంగా కోతలు**

అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఐదు గ్యారెంటీల ప్రచారంతో ఊదరగొట్టిన కాంగ్రెస్.. ఎట్టకేలకు అధికారంలోకి వచ్చింది. గ్యారెంటీలను అమలు చేయాలంటే ఏటా రూ.52 వేల కోట్ల భారం పడుతుంది. దీంతో గ్యారెంటీల అమలుకు అయ్యే నిధుల కోసం సిద్ధరామయ్య సర్కార్ ఛార్జీల పెంపు, పన్ను వసూళ్లకు తెగబడుతున్నదనే విమర్శలు పెద్దయెత్తున వస్తున్నాయి. 'ఉచిత విద్యుత్తు' అంటూ ఊదరగొట్టి ఛార్జీల పెంపునకు తెరతీశారని, మహిళలకు ఆర్థిక భరోసా ఇస్తామన్న 'గృహలక్ష్మి' స్కీమ్‌కు కొత్త ఆంక్షలు జోడించారని, ఆడబిడ్డలకు ఉచిత బస్సు సర్వీసులంటూ ఊరించిన 'శక్తి' స్కీమ్‌లో వయసు, వృత్తి అంటూ కొత్త పరిమితులు తెచ్చారని, నిరుద్యోగులకు భృతి కల్పిస్తామన్న 'యువనిధి', పేదలకు ఉచిత బియ్యమన్న 'అన్నభాగ్య' ఇలా ప్రతీ స్కీమ్ లోనూ కోతలు విధిస్తున్నారని ప్రజలు ఆగ్రహంతో రగిలిపోతున్నారు.

**ఏడాదిలో కర్ణాటకలో పన్నుల వాత ఇలా..**

- పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్ – 4 శాతం పెంపు
- గైడెన్స్ వ్యాల్యూ ట్యాక్స్ – 15 నుంచి 30% పెంపు
- దేశీయ లిక్కర్‌పై అదనపు ఎక్సైజ్ డ్యూటీ – 20 శాతం పెంపు
- బీర్లపై అదనపు ఎక్సైజ్ డ్యూటీ – 175 నుంచి 185 శాతం పెంపు
- కొత్తగా రిజిస్టరైన రవాణా వాహనాలపై అదనపు సెస్ – 3 శాతం పెంపు
- రూ.25 లక్షల పైబడిన ఎలక్ట్రికల్ వాహనాలపై లైఫ్‌టైమ్ ట్యాక్స్ విధింపు

### చన్నపట్న ఉప ఎన్నిక బరిలో డీకే?

చన్నపట్న ఉప ఎన్నిక బరిలో డీకే శివకుమార్ నిలవనున్నట్టు తెలుస్తున్నది. ఈ విషయంలో పార్టీ, నియోజకవర్గ ప్రజల నిర్ణయానికి తాను కట్టుబడి ఉంటానని బుధవారం చెప్పడం ఆ వార్తలకు బలం చేకూర్చింది. 'చన్నపట్న నాకు గుండెకాయ వంటిది. నా రాజకీయ జీవితాన్ని కూడా అక్కడి నుంచే ప్రారంభించాను' అని పేర్కొన్నారు. డీకే శివకుమార్ గతంలో ప్రాతినిథ్యం వహించిన సాతనూర్ నియోజకవర్గ పరిధిలో చన్నపట్న ఉండేది. ఇక్కడి నుంచి తాను గతంలో నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానని, చన్నపట్న ప్రజలు ఆశీర్వదించారని డీకే పేర్కొన్నారు. జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా గెలువడంతో చన్నపట్న అసెంబ్లీ స్థానం ఖాళీ అయింది..

**సోదరుడు సురేశ్ కోసమేనా?**

డీకే శివకుమార్ సోదరుడు సురేశ్ ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో బెంగళూరు రూరల్ నుంచి పోటీచేసి ఓడిపోయారు. ఇప్పుడు చన్నపట్న నుంచి పోటీచేసి, అక్కడ గెలిస్తే.. డీకే శివకుమార్ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కనకపురను సురేశ్ కోసం వదిలేయాలనే ఆలోచనలో ఉన్నట్టు కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. చన్నపట్న, కనకపుర రెండు కూడా వొక్కలిగ సామాజికవర్గం బలంగా ఉండే రామనగర జిల్లా పరిధిలోకి వస్తాయి.

### డయాబెటిస్ ఔషధ ధరలు పెంపు

న్యూఢిల్లీ: మధుమేహం, రక్తపోటు తదితర 54 రకాల ఔషధాల ధరలను కేంద్ర ప్రభుత్వం సవరించింది. సవరించిన ధరల జాబితాలో డయాబెటిస్, బీపీ మందులతోపాటు గుండె జబ్బులు, బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లు, అలర్జీలు, మల్టీ విటమిన్ల మందులు ఉన్నాయి. డయాబెటిస్ రోగులు అధికంగా వినియోగించే మెట్‌ఫార్మిన్, లినాగ్లిప్టిన్, సిటాగ్లిప్టిన్ ధరలను ట్యాబ్లెట్‌కు రూ.15 నుంచి రూ.20కు పెంచారు. సిప్రోఫ్లోక్సాసిన్ యాంటీ బ్యాక్టీరియల్ ఇంజెక్షన్ రిటైల్ ధరను మిల్లీలీటర్‌కు 23 పైసలుగా నిర్ధారించారు. రక్తపోటుకు వినియోగించే టెల్మీసార్టన్, క్లోర్తాలిడోన్, సిల్నిడిపైన్ మందుల ధరను ట్యాబ్లెట్‌కు రూ.7.14గా సవరించారు. కొలెస్ట్రాల్ చికిత్సకు ఉపయోగించే ఆస్పిరిన్, ఆటోర్వాస్టాటిన్ కాంబినేషన్ మందును క్యాప్సుల్‌కు రూ.2.68గా మార్చారు. ఇక కాల్షియం, విటమిన్ డీ3 పిల్స్ ధరలను ట్యాబ్లెట్‌కు రూ.7.82 వద్ద ఫిక్స్ చేశారు.

### నిజ్జర్‌కు కెనడా పార్లమెంట్ నివాళి

**నిరసన తెలిపిన భారత్**

న్యూఢిల్లీ, జూన్ 19: గత ఏడాది కాల్పుల్లో మరణించిన సిక్కు ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్‌కు కెనడా పార్లమెంట్ మౌనం పాటించి నివాళి అర్పించింది. ఉగ్రవాదికి ఒక పార్లమెంట్ సంతాపం తెలపడాన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. గతంలో సిక్కు ఉగ్రవాదుల కనిష్క విమానం పేల్చివేత ఉదంతాన్ని దౌత్య వేత్త గుర్తు చేశారు.

### నకిలీ బెదిరింపు కాల్స్ చేస్తే ఐదేండ్ల నిషేధం!

న్యూఢిల్లీ: విమానాశ్రయాలకు, విమానాలకు నకిలీ బాంబు బెదిరింపులు చేసే దోషులపై ఐదేండ్ల పాటు విమానయాన నిషేధం విధించాలని పౌర విమానయాన భద్రత సంస్థ ప్రతిపాదన చేసింది. ఇలాంటివి ఇటీవల పెరగడంతో తాము ఈ ప్రతిపాదన చేయాల్సి వచ్చిందని బీసీఏఎస్ డైరెక్టర్ జనరల్ జుల్ఫికర్ హసన్ చెప్పారు. మంగళవారం 41 విమానాశ్రయాలకు వచ్చిన బాంబు బెదిరింపుల ఘటనలో ఆరుగురిని అరెస్ట్ చేశామని తెలిపారు.

## ఢిల్లీలో వడగాడ్పులకు 50 మంది బలి!

**14 ఏండ్లలో ఎన్నడూ లేనంతగా రాత్రి ఉష్ణోగ్రతలు**

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీని వడగాడ్పులు వణికిస్తున్నాయి. గత 48 గంటల వ్యవధిలో రాజధాని పరిధిలో 50 మంది మృత్యువాతపడినట్టు సమాచారం. వందలాది మంది ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల్లో చికిత్స పొందుతున్నారు. గత నెల రోజులుగా రాజధానిలో 35 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో పౌరులు వేసవి తాపాన్ని తట్టుకోలేక అల్లాడుతున్నారు. రాత్రి సమయంలో కూడా వాతావరణం చల్లబడటం లేదని వారు వాపోతున్నారు. గత 14 ఏండ్లలో ఎన్నడూ లేనంతగా రాత్రి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. నగరంలో పచ్చదనం అంతరించిపోయి, విచ్చలవిడిగా నిర్మాణాలు పెరగడమే ఈ పరిస్థితికి కారణమని నిపుణులు పేర్కొంటున్నారు. వడగాల్పులు, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కేంద ఆరోగ్య శాఖ బుధవారం అడ్వైజరీ జారీ చేసింది. వడదెబ్బ రోగులకు ప్రత్యేక యూనిట్లు ఏర్పాటుచేయాలని దవాఖానలను ఆదేశించింది.

## హజ్ యాత్రలో 68 మంది భారతీయుల మృతి

**మరికొంత మంది మిస్సింగ్.. వేడిమి తట్టుకోలేక పలువురు మృత్యువాత**

రియాద్, జూన్ 19: ముస్లింలు ఎంతో పవిత్రంగా జరిపే మక్కా యాత్రలో ఈ ఏడాది సుమారు 68 మంది భారతీయులు మృతి చెందారు. పలువురు అదృశ్యం కావడమో, తప్పిపోవడమో జరిగింది. అయితే వీరు ఎంతమంది అన్నది తెలియరాలేదు. కాగా, హజ్ యాత్రలో ఈ ఏడాది మొత్తం 550 మంది యాత్రికులు మరణించినట్టు అరబ్ దౌత్యవేత్తలు మంగళవారం ప్రకటించారు. అలాగే సుమారు రెండు వేల మంది వివిధ దవాఖానలలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. అత్యంత వేడి వాతావరణాన్ని తట్టుకోలేకే పలువురు మరణించినట్టు నిర్వాహకులు తెలిపారు. మృతులలో 323 మంది ఈజిప్ట్, 60 మంది జోర్డాన్ పౌరులని, వేసవి వేడి వాతావరణం కారణంగా ఏర్పడిన సమస్యలతోనే వీరు మరణించినట్టు అరబ్ దౌత్య వర్గాలు తెలిపాయి. కాగా సోమవారం మక్కాలో 51.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఆ వేడికి తట్టుకోలేక పలువురు యాత్రికులు నెత్తిపై నుంచి బాటిళ్లతో నీరు వంపుకోవడం కన్పించింది.

# వరికి మద్దతు రూ. 117 పెంపు



- 14 రకాల పంటల కనీస మద్దతు ధరలు పెంచిన కేంద్రం
- పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నిర్ణయం
- మహారాష్ట్రలో 76 వేల కోట్లతో గ్రీన్ ఫీల్డ్ డీప్ పోర్టు
- వారణాసి ఎయిర్‌పోర్టు అభివృద్ధికి రూ.2,870 కోట్లు
- గుజరాత్, తమిళనాడుల్లో పవన విద్యుత్తు ప్రాజెక్టులు
- కేంద్ర క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు

న్యూఢిల్లీ, జూన్ 19: వరికి కనీస మద్దతు ధరను (ఎంఎస్పీ) రూ.117 పెంచుతూ కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నది. 2024-25 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి మొత్తం 14 పంటల ఎంఎస్పీని పెంచింది. వరి పంటకు ఎంఎస్పీని రూ.117 పెంచడంతో(5.35 శాతం) క్వింటాల్ వరి రూ.2,300కి చేరింది. త్వరలో హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎంఎస్పీ ధరలను పెంచడం గమనార్హం.

**పలు ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్**

మహారాష్ట్రలోని వధావన్ వద్ద రూ.76,200 కోట్లతో ఆల్ వెదర్ గ్రీన్ ఫీల్డ్ డీప్ డ్రాఫ్ట్ మేజర్ పోర్టును అభివృద్ధి చేసేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇది పూర్తయితే 12 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. పీపీపీ పద్ధతిలో ఈ పోర్టు నిర్మాణం జరుగుతుందని ప్రభుత్వ ప్రకటన తెలిపింది. ప్రధాని మోదీ ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి ఎయిర్‌పోర్టు అభివృద్ధికి రూ.2,869.65 కోట్ల ప్లాన్‌కు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో భాగంగా కొత్త టెర్మినల్ భవనం నిర్మించడంతోపాటుగా రన్‌వే విస్తరణ, ఏడాదికి 99 లక్షల మంది ప్రయాణాలు చేసేలా ఎయిర్‌పోర్టు సామర్థ్యాన్ని పెంచనున్నారు. పవన విద్యుత్తు ప్రాజెక్టుల నిర్మాణం కోసం రూ.7,453 కోట్లతో వయబిలిటీ గ్యాప్ ఫండింగ్(వీజీఎఫ్) స్కీమ్‌కు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా గుజరాత్, తమిళనాడు రాష్ట్రాల్లో 500 మెగావాట్ల చొప్పున సామర్థ్యంతో రెండు పవన విద్యుత్తు ప్రాజెక్టులను నిర్మించనున్నట్టు అశ్విని వైష్ణవ్ తెలిపారు. దేశంలో కొత్త క్యాంపస్‌లు, ల్యాబ్‌లతో కూడిన ఫోరెన్సిల్ మౌలిక సదుపాయాల నిర్మాణానికి రూ.2,254.43 కోట్లతో నేషనల్ ఫోరెన్సిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎన్‌హ్యాన్స్‌మెంట్ స్కీమ్(ఎన్‌ఎఫ్ఐఈఎస్)కు కూడా క్యాబినెట్ పచ్చజెండా ఊపింది.

**కనీస మద్దతు ధరల పెంపు (క్వింటాల్‌కు)**

| పంట రకం | 2023-24తో పోలిస్తే పెంపు (రూ.ల్లో) | 2024-25 ఎంఎస్పీ (రూ.ల్లో) |
|---|---|---|
| వరి(సాధారణం) | 117 | 2,300 |
| వరి(గ్రేడ్-ఏ) | 117 | 2,320 |
| జొన్న(హైబ్రిడ్) | 191 | 3,371 |
| జొన్న(మాల్దండి) | 196 | 3,421 |
| సజ్జలు | 125 | 2,625 |
| రాగి | 444 | 4,290 |
| మక్కజొన్న | 135 | 2,225 |
| కందులు | 550 | 7,550 |
| పెసలు | 124 | 8,682 |
| మినుము | 450 | 7,400 |
| వేరుశనగ | 406 | 6,783 |
| పొద్దుతిరుగుడు | 520 | 7,280 |
| సోయాబీన్(ఎల్లో) | 292 | 4,892 |
| నువ్వులు | 632 | 9,267 |
| నైగర్‌సీడ్ | 983 | 8,717 |
| పత్తి(మీడియం స్టైపెల్) | 501 | 7,121 |
| పత్తి(లాంగ్ స్టైపెల్) | 501 | 7,521 |

### సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం

**కువైట్ పర్యటనకు అనుమతి నిరాకరణపై విజయన్ లేఖ**

తిరువనంతపురం, జూన్ 19: కేరళ ఆరోగ్య మంత్రి వీణా జార్జ్ కువైట్ పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించటాన్ని ఆ రాష్ట్ర సీఎం పినరయ్ విజయన్ తప్పుబట్టారు. 'ఇది రాజకీయాలు చేసే సమయం కాదు. రాజకీయాలకు చోటులేని అంశమిది' అంటూ ప్రధాని మోదీకి రాసిన లేఖలో కేంద్రం తీరును విమర్శించారు. రాష్ట్ర మంత్రి కువైట్ పర్యటనకు రాజకీయ అనుమతి కోరగా, విదేశాంగ శాఖ నిరాకరించిందన్న సంగతిని ప్రధాని మోదీ దృష్టికి తీసుకొచ్చారు. కేంద్రం తీరు సహకార సమాఖ్య విధానాలకు పూర్తి విరుద్ధమని లేఖలో విజయన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. జూన్ 15న సీఎం విజయన్ ప్రధాని మోదీకి రాసిన లేఖను ఆ రాష్ట్ర సర్కార్ బుధవారం మీడియాకు విడుదల చేసింది. జూన్ 12న కువైట్‌లో జరిగిన అగ్నిప్రమాద ఘటనలో 46 మంది భారతీయ కార్మికులు మరణించారు. ఇందులో 23మంది కేరళకు చెందినవారే ఉన్నారు. దీంతో కువైట్‌లో సహాయక కార్యక్రమాన్ని వేగవంతం చేసేందుకు ఆరోగ్యమంత్రి వీణా జార్జ్‌ను పంపాలని ఆ రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించింది. అయితే ఆమె కువైట్ పర్యటనను కేంద్రం అడ్డుకోవటం రాజకీయంగా వివాదాన్ని రేపింది.

# యూజీసీ నెట్ పేపరూ లీక్!

- పరీక్ష జరిగిన తర్వాతి రోజే రద్దు చేసిన ఎన్టీఏ
- పలు అవకతవకలు జరిగినట్టు సమాచారం
- సీబీఐతో సమగ్ర దర్యాప్తునకు నిర్ణయం
- నీట్ దుమారం వేళ సంచలన పరిణామం
- కొత్తగా పరీక్ష నిర్వహిస్తామని ఎన్టీఏ వెల్లడి

న్యూఢిల్లీ, జూన్ 19: ఓవైపు నీట్ యూజీ-2024 పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ అయిందని, పలు అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు దేశవ్యాప్తంగా దుమారం రేపుతున్న వేళ మరో సంచలన పరిణామం చోటుచేసుకొన్నది. మంగళవారం దేశవ్యాప్తంగా నిర్వహించిన యూజీసీ-నెట్(యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్-జాతీయ అర్హత పరీక్ష)ను రద్దు చేస్తున్నట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ బుధవారం ప్రకటించింది. నెట్ పరీక్షలో పలు అవకతవకలు జరిగినట్టు గుర్తించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకొన్నట్టు తెలిపింది. పరీక్ష సమగ్రత దెబ్బతిన్నట్టు కేంద్ర హోంశాఖ పరిధిలోని ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్‌కి(ఐ4సీ) చెందిన నేషనల్ సైబర్ క్రైమ్ థ్రెట్ అనలటిక్స్ యూనిట్ నుంచి యూజీసీకి సమాచారం వచ్చిందని ఎన్టీఏ వెల్లడించింది. పరీక్ష ప్రక్రియ ఉన్నత స్థాయి పారదర్శకత, పవిత్రతను కాపాడేందుకు యూజీసీ నెట్ పరీక్షను రద్దు చేసేందుకు కేంద్ర విద్యా శాఖ నిర్ణయం తీసుకొన్నదని తెలిపింది.

**మళ్లీ పరీక్ష.. తేదీలు త్వరలో**

కొత్తగా పరీక్ష నిర్వహిస్తామని, సంబంధిత సమాచారాన్ని త్వరలో వెల్లడిస్తామని ఎన్టీఏ ఓ ప్రకటనలో పేర్కొన్నది. నెట్ పరీక్షలో అవకతవకల వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు కోసం ఈ అంశాన్ని సీబీఐకి అప్పగిస్తున్నట్టు తెలిపింది. యూజీసీ-నెట్ పరీక్షను మంగళవారం దేశవ్యాప్తంగా 317 నగరాల్లోని 1205 సెంటర్లలో నిర్వహించారు. ఓఎంఆర్(పెన్, పేపర్) విధానంలో నిర్వహించిన ఈ పరీక్షకు 9 లక్షల మందికి పైగా అభ్యర్థులు హాజరయ్యారు.



**ఇప్పటికే కొనసాగుతున్న నీట్ వివాదం**

దేశవ్యాప్తంగా వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు గత నెల నిర్వహించిన నీట్ యూజీ-2024 పరీక్ష లీక్ అయిందని, పరీక్షలో అక్రమాలు జరిగాయని పెద్దయెత్తున ఆరోపణలు వస్తున్న విషయం తెలిసిందే. లక్షలాది మంది విద్యార్థులకు సంబంధించిన ఈ అంశం ఇప్పుడు దేశంలో హాట్‌టాపిక్‌గా మారింది. నీట్ అంశంపై సుప్రీంకోర్టుకు ఎక్కడంతోపాటు అభ్యర్థులు, విద్యా సంఘాలు, రాజకీయ పార్టీలు దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నాయి. నీట్ లీకేజీ, అక్రమాల ఉదంతాలు బీహార్, గుజరాత్ రాష్ట్రాల్లో వెలుగు చూసిన విషయం తెలిసిందే. ఆయా రాష్ట్రాల్లో పోలీసు కేసులు నమోదు చేయడంతోపాటు, పలువురిని అరెస్టులు కూడా చేశారు. నీట్ పరీక్షలో ఎన్నడూ లేని విధంగా ఏకంగా 67 మంది విద్యార్థులు 720/720 మార్కులు సాధించి టాప్ ర్యాంకు సాధించడం అందరినీ నివ్వెరపరిచింది. అందులోనూ హర్యానాలో ఫరీదాబాద్‌లోని ఒక సెంటర్‌లో పరీక్ష రాసిన ఆరుగురు టాప్ ర్యాంక్ సాధించడం మరింత ఆశ్చర్యపరిచే అంశం. మరోవైపు సమయం కోల్పోవడం, ఇతరత్రా కారణాలతో 1,563 మంది విద్యార్థులకు గ్రేస్ మార్కులు ఇవ్వడం మరొక అంశం. తీవ్ర విమర్శల నేపథ్యంలో విద్యార్థులకు ఇచ్చిన గ్రేస్ మార్కులను ఉపసంహరించుకొన్న ఎన్టీఏ.. వారికి తిరిగి పరీక్ష నిర్వహించనున్నట్టు సుప్రీంకోర్టుకు తెలిపింది.

**బీహార్ పోలీసుల నుంచి నివేదిక కోరిన కేంద్ర విద్యా శాఖ**

బీహార్‌లోని పాట్నాలో నీట్ యూజీ-2024 పరీక్ష నిర్వహణలో జరిగిన అక్రమాలకు సంబంధించి కేంద్ర విద్యా శాఖ బుధవారం రాష్ట్ర పోలీసు శాఖకు చెందిన ఆర్థిక నేరాల విభాగం నుంచి నివేదిక కోరింది.

## ఎన్నికల బరిలో ఏఐ అభ్యర్థి!



*లండన్, జూన్ 19: కృత్రిమ మేధాతో రూపొందిన 'ఏఐ అభ్యర్థి' బ్రిటన్ పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలిచాడు. ఒకవేళ అతడు గెలిస్తే.. ప్రపంచంలోనే మొట్టమొదటి 'ఏఐ చట్టసభ సభ్యుడు' అవుతాడని మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. జూలై 4న జరగనున్న బ్రిటన్ పార్లమెంట్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా నిలబడ్డ వ్యాపారవేత్త స్టీవ్ ఎండాకోట్(59)కు మరో రూపమే 'ఏఐ స్టీవ్'. ఇతర అభ్యర్థుల మాదిరిగా కాకుండా, తన రూపాన్ని 'ఏఐ'తో రూపొందించి ప్రచారంలోకి తీసుకొచ్చాడు. కరపత్రంపైనా ముద్రించి పంచుతున్నాడు. ఈ ఎన్నికల తర్వాత పార్టీని స్థాపించి.. దేశవ్యాప్తంగా 'ఏఐ అభ్యర్థుల'ను తీసుకొస్తానని స్టీవ్ ఎండాకోట్ చెబుతున్నాడు. ప్రస్తుతం నెలకొన్న రాజకీయాలతో విసుగుచెంది.. 'బ్రైటన్ పెవిలియన్' నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలో నిలబడినట్టు చెప్పాడు. ఇదిలా ఉండగా, ఎన్నికల్లో గెలిస్తే.. ఎండాకోట్ ఎంపీ అవుతాడని, అతడి ఏఐ వెర్షన్ కాదని ఆ దేశ ఎలక్టోరల్ కమిషన్ స్పష్టతనిచ్చింది.*



### రక్తపరీక్షతో పార్కిన్సన్స్ నిర్ధారణ

*న్యూఢిల్లీ, జూన్ 19: ఒక సాధారణ రక్త పరీక్షతో పార్కిన్సన్స్ వ్యాధిని 7 ఏండ్ల ముందే గుర్తించవచ్చునని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. పార్కిన్సన్స్ వ్యాధిని ముందుగానే పసిగట్టే 'మెషిన్ లెర్నింగ్'ను యూనివర్సిటీ కాలేజీ లండన్ పరిశోధకులు అభివృద్ధి చేశారు. దీని సాయంతో 72 మంది రోగుల రక్త నమూనాలను విశ్లేషించగా, దాంట్లో 80 శాతం మంది పార్కిన్సన్స్ వ్యాధి బారినపడే అవకాశముందని తేలింది. రోగుల మెదడులోని 'ఆల్ఫా-సిన్‌క్లిన్' ప్రొటీన్.. ప్రొఫైల్‌తో రక్తనమూనాలను మెషిన్ లెర్నింగ్ విధానంలో పోల్చి పార్కిన్సన్స్‌ను కొన్నేండ్ల ముందే గుర్తించవచ్చు.*

## ప్రాణాలు హరిస్తున్న వాయుకాలుష్యం

**న్యూఢిల్లీ, జూన్ 19: వాయుకాలుష్యం కారణంగా 2021లో ప్రపంచవ్యాప్తంగా 81 లక్షల మంది ప్రాణాలు కోల్పోయినట్టు అమెరికాకు చెందిన హెల్త్ ఎఫెక్ట్స్ ఇన్‌స్టిట్యూట్ (హెచ్ఈఐ) సంస్థ వెలువరించిన తాజా నివేదికలో వెల్లడైంది. భారత్‌లో 21 లక్షలమంది మరణించినట్టు ఈ నివేదిక తెలిపింది. యునిసెఫ్‌తో కలిసి హెచ్ఈఐ ఈ పరిశోధన చేపట్టింది. దక్షిణ ఆసియాలో మరణాలకు వాయు కాలుష్యం ప్రధాన కారణంగా ఉన్నదని, తర్వాతి స్థానాల్లో అధిక రక్తపోటు, పొగాకు ఉన్నాయని తెలిపింది.**

**ప్రాణాలు తీస్తున్న కాలుష్య రక్కసి**

- *2021లో ప్రపంచవ్యాప్తంగా మరణాలు- 81 లక్షలు*

భారత్ **21** లక్షలు

చైనా **23** లక్షలు

భారత్, చైనా దేశాల్లోనే - **54%**

- *ఐదేండ్ల లోపు చిన్నారుల మరణాలు*

| భారత్ | నైజీరియా | పాకిస్థాన్ |
|---|---|---|
| 1,69,400 | 1,14,100 | 68,100 |
| **ఇథియోపియా** | **బంగ్లాదేశ్** | |
| 31,100 | 19,100 | |



## 'ఏఐ' బ్యూటీ జారా శతావరి

**మిస్ ఏఐ టాప్-10లో భారత భామ**

న్యూఢిల్లీ: జారా శతావరి.. ఇప్పుడీ పేరు దేశవ్యాప్తంగా హాట్ టాపిక్ అయింది. కృత్రిమ మేధా (ఏఐ) ద్వారా సృష్టించిన అందగత్తెల కోసం ప్రపంచంలోనే తొలిసారి 'ఫ్యాన్‌వ్యూ' సంస్థ నిర్వహిస్తున్న అందాల పోటీలో భారత్‌కు చెందిన శతావరి టాప్-10లోకి దూసుకెళ్లింది. యాడ్ ఏజెన్సీ వ్యవస్థాపకులు రాహుల్ చౌదరి ఈ ఏఐ సొగసరి సృష్టికర్త. జూన్ 2023 నుంచి పీఎంహెచ్ బయోకేర్ బ్రాండ్ అంబాసిడర్‌గా జారా వ్యవహరిస్తున్నది. నోయిడాకు చెందిన డిజిమోజో ఈ సర్వీసెస్ ఎల్ఎల్‌పీలో 'ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్ టాలెంట్ మేనేజర్'గా చేరింది.

**ఏంటీ ఏఐ అందాల పోటీలు?**

ఈ పోటీలో కృత్రిమ మోడళ్ల అందం, సాంకేతిక నైపుణ్యాలు, సామాజిక పేరు ప్రఖ్యాతుల ఆధారంగా ప్రతిభను అంచనా వేసి విజేతకు కిరీటం తొడుగుతారు.

